సాక్షి మెదక్

బుధవారం । 8 । జనవరి । 2025



సాఫ్ట్ బాల్ జట్ల ఎంపిక

ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 14 బాల, బాలికల సాఫ్ట్ బాల్ జట్ల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. వివరాలు 8లో ▸



పూత దశలో నీటి ఎద్దడి..

రబీలో శనగ పంటను రైతులు అధికంగా సాగు చేస్తారు. వంట రక్షణకు సకాలంలో చర్యలు చేపట్టకపోతే తెగుళ్లు సోకుతాయి. వివరాలు 8లో ▸



పిల్లల సంరక్షణకు ప్రాధాన్యం

పోక్సో కేసుల్లో బాధిత పిల్లల సంరక్షణకు భరోసా కేంద్రం ద్వారా మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ నిరంతరం కృషి చేస్తుందని మెదక్ జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పోచయ్యలు పేర్కొన్నారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని మూసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్టీయూ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్, మండల విద్యాధికారి వెంకటేశం ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు నందయ్యగారి శ్రీనివాస్, బాధ్యులు రాధాకిషన్, కుమార్, అశోక్‌రెడ్డి, ఆనంద్, వెంకట్, శేఖర్ గౌడ్ అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ సమైక్య రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఆడిటర్లు

శివంపేట (నర్సాపూర్): గ్రామ సమైక్యకు సంబంధించి రికార్డులను సోషల్ ఆడిట్ సిబ్బంది మంగళవారం పరిశీలించింది. ఆరు నెలలకు సంబంధించి జమ ఖర్చుల వివరాలు నమోదును పరిశీలించడంతోపాటు పలు సూచనలు చేసింది. కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, ఆడిటర్లు నాగరాజు, దత్తాత్రేయ గ్రామ సమైక్య అధ్యక్షురాలు, సీఏలు సిబ్బంది ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజేందర్

నర్సాపూర్ రూరల్: ప్రతీ విద్యార్థికి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని కర్పెడ్ సంస్థ ఆర్గనైజర్ రాజేందర్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం కర్పెడ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సబ్బులు, శానిటైజర్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంబాబు, ఉపాధ్యాయులు శంకర్, సుధీర్ కుమార్ గౌడ్, మల్లేష్ సాయి కుమార్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె విరమణ



ఏడీ విజయలక్ష్మికి సమ్మె విరమణ పత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: రెగ్యులరైజ్ లక్ష్యంతో కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె చేపట్టిన సమగ్ర శిక్షా ఉద్యోగులు మంగళవారం విరమించారు. మెదక్ సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీ విజయలక్ష్మికి సమ్మె విరమణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో సంఘం నాయకులు జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక అంశమైన పేస్కేల్ అమలు చేయడానికి ప్రభుత్వం 4 నెలల సమయం తీసుకుంటుందన్నారు. మిగతా ఆర్థికేతరంశాలన్నీ పరిష్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో చర్చలు సఫలం అయ్యాయని తెలిపారు. ఈ మేరకు తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నామని జిల్లా జేఏసీ అధ్యక్షులు రాజు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లాలోని సమగ్ర శిక్షా అన్ని విభాగాల అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



మట్టిలో కురుకుపోయిన మందాపూర్‌లో వైకుంఠధామం గది



శ్మశాన స్థలంలో మట్టి పోసి చదును చేసి..

శ్మశాన స్థలం కబ్జా

అక్రమార్కులు శ్మశాన వాటిక స్థలాన్ని సైతం వదల్లేదు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అల్లాదుర్గం మండలం మందాపూర్‌లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.10 లక్షలతో ప్రభుత్వం శ్మశాన వాటిక నిర్మించింది. వాటిక పక్కనున్న వ్యక్తి యథేచ్ఛగా స్థలం కబ్జా చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. వాటిక గది ముఖద్వారం వద్ద మట్టి వేసి కబ్జా చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీడీఓ , ఇన్‌చార్జి ఎంపీఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ ఆక్రమణపై కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – అల్లాదుర్గం(మెదక్)

295 ప్రత్యేక బస్సులు



సంక్రాంతికి ఆర్టీసీ చర్యలు

- ఈ నెల 10 నుంచి అందుబాటులోకి..
- ప్రయాణికులపై 50 శాతం అదనపు భారం
- 'మహాలక్ష్మి' ప్రయాణాలపై కొరవడిన స్పష్టత

50 శాతం చార్జీ పెంపు

నారాయణఖేడ్: సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఈనెల 10వ తేదీనుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధమయ్యారు. 10, 11, 12, 13వ తేదీల్లో ప్రత్యేక సర్వీసులు నడుస్తాయి. అనంతరం 14, 15 తేదీల్లో పండుగ ఉండడంతో ఆరోజుల్లోనూ సాధారణ సర్వీసులే ఉంటాయి. తిరుగు ప్రయాణంగా 16, 17, 18, 19, 20వ తేదీల్లో ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. గత పండుగల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని మెదక్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ అధికారులు 8 డిపోల నుంచి 542 సర్వీసులు 12 రోజులు నడిపి రూ.14.72కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నారు. ఈ సంక్రాంతిని సైతం మంచి ఆదాయం సమకూర్చుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

సంక్రాంతి స్పెషల్ సర్వీసులుగా నడిచే బస్సుల్లో 50 శాతం చార్జీలు అదనంగా వసూలు చేయనున్నారు. ఉన్న చార్జీకి అదనంగా 50 శాతం చార్జీలు వసూలు చేస్తారు. ఈ సర్వీసుల్లో మహాలక్ష్మి టికెట్ వర్తింపుపై ఆర్టీసీ సంస్థ నుంచి ఇంకా స్పష్టమైన ఆదేశాలు రాలేదని ఆర్టీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ బస్సులు నడిపినా రద్దీ పెరిగిన పక్షంలో మరిన్ని సర్వీసులు సైతం నడిపేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

సర్వీసులు ఇలా..

మెదక్ రీజియన్ పరిధిలోని ఆయా డిపోలకు సంబంధించిన బస్సులు హైదరాబాద్ నుంచి ఆంధ్రలోని అమలాపురం, విజయవాడ, గుంటూరు, కాకినాడ, కందుకూరు, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాలకు సర్వీసులు నడుపుతున్నారు. దీంతోపాటు ఆయా డిపోలకు చెందిన సర్వీసులు సైతం హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్ డిపోకు సంబంధించి జేబీఎస్, సికింద్రాబాద్, లింగంపల్లి, పటాన్‌చెరు, జహీరాబాద్ డిపో.. జేబీఎస్, లింగంపల్లి, సంగారెడ్డి క్రాస్‌రోడ్, సంగారెడ్డి డిపో.. జేబీఎస్, సికింద్రాబాద్, గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ డిపో.. సికింద్రాబాద్, మెదక్ డిపో.. సికింద్రాబాద్, బాలానగర్ వయా నర్సాపూర్, సిద్దిపేట డిపో.. జేబీఎస్, కరీంనగర్, వేములవాడ, దుబ్బాక డిపో.. సికింద్రాబాద్, నర్సాపూర్ డిపో.. జేబీఎస్, బాలానగర్ నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు.

డీఎంల పర్యవేక్షణ

నారాయణఖేడ్	99592-23170
జహీరాబాద్	99592-26269
సంగారెడ్డి	99592-26267
గజ్వేల్- ప్రజ్ఞాపూర్	99592-26270
మెదక్	99592-26268
సిద్దిపేట	99592-26271
దుబ్బాక	99592-26271
నర్సాపూర్	99592-26268

రద్దీ పెరిగితే మరిన్ని సర్వీసులు



మెదక్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి సంక్రాంతి స్పెషల్ సర్వీసులను నడుపుతున్నాం. 10 నుంచి 13 వరకు, అనంతరం 16 నుంచి 20 వరకు ఈ బస్సులు తిరుగుతాయి. రద్దీ పెరిగిన పక్షంలో అదనపు సర్వీసులు నడుపుతాం. స్పెషల్ బస్సుల్లో 50 శాతం చార్జీ అదనంగా ఉంటుంది.

– ప్రభులత, ఆర్.ఎం సంగారెడ్డి

ప్రత్యేక బస్సుల వివరాలు

డిపో	హైదరాబాద్ నుంచి డిపోల పరిధిలో..	ఆంధ్రకు
మెదక్	40	5
నారాయణఖేడ్	32	3
నర్సాపూర్	17	3
సంగారెడ్డి	42	3
జహీరాబాద్	37	1
సిద్దిపేట	57	0
గజ్వేల్-ప్రజ్ఞాపూర్	36	0
దుబ్బాక	19	0
మొత్తం	280	15

ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్

మెదక్ కలెక్టరేట్: రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. అతివేగం వల్ల వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఆరంభమయ్యే దగ్గరి నుంచి ముగింపు ప్రాంతం వరకు పోలీస్, నేషనల్ హైవే, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ ద్వారా ప్రమాదాలు తరుచూ జరుగుతున్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. ప్రమాదాలకు గల కారణాలపై సమావేశాల ద్వారా చర్చించిన నివారణకు కృషి చేయాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ముఖ్య ప్రదేశాలలో ప్రమాద సూచికలు, మలుపుల వద్ద స్పీడ్ లిమిట్ సూచికలు తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లా మీదుగా వెళ్తున్న ప్రధాన జాతీయ రహదారుల మీద రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు నేషనల్ హైవే అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై కళాశాలల యజమాన్యాలు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.

పోలీసు శాఖ విశేష కృషి

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం విశేష కృషి చేస్తోందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు, డ్రంకెన్ డ్రైవ్‌లు, తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల్లో చైతన్యం వచ్చేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ, పోలీస్, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ప్రజలు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా పరిరక్షిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఆర్ అండ్‌బీ ఈఈ సర్దార్ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, మెదక్ మున్సిపల్ కమిషనర్, శ్రీనివాస్ రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, నేషనల్ హైవే, పంచాయతీ రాజ్, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

లొట్టపీసు కేసు అంటూ అవమాన పరుస్తారా?

- మరి విచారణకు న్యాయవాదులు ఎందుకు?
- కేటీఆర్ తీరుపై ఎంపీ రఘునందర్ ఫైర్




మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

నర్సాపూర్ రూరల్, మనోహరాబాద్(తూప్రాన్): లొట్టపీసు కేసు అంటూ మాజీమంత్రి కేటీఆర్.. సీబీఐ, పోలీసులను అవమాన పరుస్తున్నారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మండిపడ్డారు. మరి కేసు విచారణకు న్యాయవాదులను ఎందుకు తీసుకెళ్లినట్లు అని ప్రశ్నించారు. మంగళవారం నర్సాపూర్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో, మనోహరాబాద్ మండల పీహెచ్‌సీకి మంజూరైన 108 అంబులెన్స్ ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కేటీఆర్ సీబీఐ, పోలీసులను అవమానపరిచారని ఆరోపించారు. కేటీఆర్ ఈ ఫార్ములా ఆరోపణలు మొదలైనప్పటి నుంచి లొట్టపీసు కేసుకు ఉదయం వెళ్లి సాయంత్రం వస్తామని చెప్పి.. ఇప్పుడేమో న్యాయవాదులను వెంటబెట్టుకుని విచారణకు హాజరు కావడం విడ్డూరంగా ఉందన్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు తాను మల్లన్న సాగర్ కు వెళుతుంటే పోలీసులతో అరెస్టు చేయించారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులకు అధికారం పోయి 13 నెలలు గడుస్తున్నా అహంకారం మాత్రం తగ్గలేదన్నారు. కాగా, దొంగ చాటుగా తాను లేనప్పుడు బీజేపీ కార్యాలయానికి వెళ్లి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు.. బీజేపీ నాయకులపై దాడులు చేయడం విచారకరమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతీఒక్కరికి మాట్లాడే హక్కు ఉందని దాన్ని చట్టపరంగా ఎదుర్కోవాలి తప్ప దాడులు చేయడం సబబు కాదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మీకు బాధ్యతలు ఇస్తారని తెలిసిందని విలేకరులు ప్రశ్నించగా అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటారని తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐ కృషి అభినందనీయం

కౌడిపల్లి(నర్సాపూర్): పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాలకు రూ.60 లక్షలతో అభివృద్ధి చేస్తున్న ఎన్‌ఆర్‌ఐ బాలకృష్ణారావు బ్రదర్స్ సేవలు అభినందనీయమని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. మంగళవారం కంచన్‌పల్లిలో గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ బాలకృష్ణారావు బ్రదర్స్ రూ.60లక్షలతో ఉన్నత పాఠశాలకు ప్రహరీ, రెండు అదనపు గదులు, టాయిలెట్స్ నిర్మాణం కోసం ముందుకు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాలకు తనవంతుగా ఎన్‌ఆర్‌ఐ సేవచేయడం మంచి విషయమన్నారు.



రామాయంపేటలో మూతపడిన దుకాణాలు

రామాయంపేటలో బంద్ సంపూర్ణం

- బైపాస్ రోడ్డుకు వ్యతిరేకంగా బైక్ ర్యాలీ
- దుకాణాలను మూసివేయించిన వ్యాపారులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో బంద్ సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. రామాయంపేట వద్ద బైపాస్ రోడ్డు నిర్మించొద్దంటూ.. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి తెరిచి ఉన్న దుకాణాలు మూయించారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు మాట్లాడారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో రామాయంపేటకు మరింతగా నష్టం వాటిల్లుతుందన్నారు. ఇప్పటికే జాతీయ రహదారి 47తో పట్టణంలో వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు. మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారి బైపాస్ నిర్మాణంతో మరింతగా నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ని యోజకవర్గకేంద్రం ఎత్తివేయడంతో రామాయంపేట చిన్న గ్రామంగా మారిందన్నారు. బైపాస్ నిర్మాణంతో మరింతగా ప్రాధాన్యత తగ్గుతుందని పేర్కొన్నారు. దీంతో బైపాస్ వద్దంటూ బాధితులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు తహసీల్దార్ రజనికుమారికి వినతిపత్రం అందజేశారు.

కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయం

పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్



రామాయంపేట(మెదక్): ఫార్ములా ఈ కేసులో బీఆర్‌ఎస్ గౌరవ అధ్యక్షుడు కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయమని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్ జోస్యం చెప్పారు. మంగళవారం రామాయంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేటీఆర్ క్వాష్ పిటీషన్‌ను కోర్టు కొట్టివేసిందన్నారు. ఎలాంటి తప్పు చేయనప్పుడు అడ్వకేట్లతో పాటు ఏసీబీ కార్యాలయానికి ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ అధికారంలోకి రాదనే విషయాన్ని గమనించి ఆపార్టీ నాయకులు ప్రభుత్వంపై ఇష్టానుసారంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ పుంజుకునే అవకాశం లేదని, దీంతో వారు తప్పుడు ప్రకటనలతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, రూ. ఐదు వందలకే సిలిండర్ వంటి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కుతుందని పేర్కొన్నారు.

'సీడీపీఓ'లో ఇన్‌చార్జీల పాలన

అసలే పోస్టులు ఖాళీ

- ఆపై సీడీపీఓ, ఏసీడీపీఓల డిప్యూటేషన్లు
- ఇన్‌చార్జిగా రామాయంపేట గ్రేడ్ సూపర్‌వైజర్‌కు బాధ్యతలు
- అల్లాదుర్గం ప్రాజెక్టులో 230 అంగన్‌వాడీలు
- మంత్రి దామోదర ఇలాకాలోనే ఇలా..

ఇన్‌చార్జీల పాలనలో సీడీపీఐ కార్యాలయం కొనసాగుతోంది. మూడేళ్లుగా ఇదే పరిస్థితి. పోస్టుల ఖాళీకి తోడు అధికారుల డిప్యూటేషన్‌లు. వెరసి అధికారుల అండదండలతో జిల్లా సరిహద్దులు దాటి డిప్యూటేషన్‌ల విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది లేక అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ కొరవడుతోంది. వైద్యారోగ్య శాఖ మంత్రి ఇలాకాలో ఉన్న అల్లాదుర్గం సీడీపీఓ కార్యాలయం దుస్థితి అందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం సీడీపీఓ కార్యాలయంలో సిబ్బంది లేక అస్తవ్యస్తంగా మారింది. కార్యాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. అల్లాదుర్గం ప్రాజెక్టు పరిధిలో రేగోడ్, టేక్మాల్, పెద్ద శంకరంపేట మండలాలు ఉన్నాయి. ఇందులో 9 సెక్టార్లలో 230 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం అందాల్సి ఉంది. 9 సెక్టార్లకు ఐదుగురు మాత్రమే అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఒక సూపర్‌వైజర్ ఐదేళ్లుగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. సీడీపీఓ, ఏసీడీపీఓలు కూడా డిప్యూటేషన్‌పైనే ఉన్నారు. సీడీపీఓగా లిఖిత 2022 అక్టోబర్‌లో బదిలీపై వచ్చారు. కార్యాలయంలో అడుగు పెట్టకుండానే, హైదరాబాద్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. మూడేళ్లుగా ఇన్‌చార్జీలతోనే అల్లాదుర్గం సీడీపీఓ కార్యాలయం కొనసాగుతుంది. ఇక్కడ రెగ్యులర్ సీడీపీఓని డిప్యూటేషన్ వేసి రామాయంపేట గ్రేడ్ సూపర్‌వైజర్‌ను ఇన్‌చార్జిగా డిప్యూటేషన్ వేయడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

☛ 2020 ఆగస్టులో నిజామాబాద్ జిల్లా నుంచి జ్ఞానేశ్వరి పదోన్నతిపై అల్లాదుర్గం ప్రాజెక్టుకు ఏసీడీపీఓగా బదిలీపై వచ్చారు. జాయినింగ్ అయ్యి, వారం రోజుల పాటు సెలవులపై వెళ్లారు. సెలవుల నుంచి వచ్చిన ఏసీడీపీఓ నిజామాబాద్ జిల్లా బీమ్‌గల్ ప్రాజెక్టుకు డిప్యూటేషన్ వేసుకుని వెళ్లిపోయారు. ఏసీడీపీఓ డిప్యూటేషన్‌పై వెళ్లి ఐదేళ్లు గడుస్తున్నా మరొకరిని నియమించలేదు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో అధికారులు ఇష్టం వచ్చినట్లు అక్రమ డిప్యూటేషన్లకు వేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

☛ అల్లాదుర్గం ప్రాజెక్టులో నవ్య.. గ్రేడ్1 సూపర్‌వైజర్ విధులు నిర్వహించేవారు. ఈమె సహితం హైదరాబాద్‌లోని ఫుడ్ కమిషనరేట్‌కు డిప్యూటేషన్ వేసుకుని ఐదేళ్లుగా అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. డిప్యూటేషన్ వేస్తున్న అధికారులు ఈ స్థానంలో మరొకరిని ఎందుకు నియమించడం లేదో తెలియని పరిస్థితి. 9 సెక్టార్లకు ఐదుగురు సూపర్‌వైజర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 4 పోస్టులు ఖాళీ ఉండగా ఉన్న సూపర్‌వైజర్‌ను ఎలా డిప్యూటేషన్ వేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తొమ్మిది ఏళ్లుగా అద్దె భవనం, పోస్టుల ఖాళీ

అల్లాదుర్గంలో సీడీపీఓ కార్యాలయం 2016లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తొమ్మిదేళ్లుగా కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతుంది. కార్యాలయంలో డిప్యూటేషన్ల తంతు కొనసాగుతుండగా మరో వైపు జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇటీవలే భవన నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారు. కాగా, ప్రభుత్వం నిధులు ఎప్పుడు మంజూరు చేస్తుందో, భవనం ఎన్నేళ్లకు పూర్తవుతుందో తెలియని పరిస్థితి.



అల్లాదుర్గం సీడీపీఓ కార్యాలయం ముఖద్వారం

రద్దు చేయండి

అల్లాదుర్గం సీడీపీఓ కార్యాలయంలో కొనసాగుతున్న అక్రమ డిప్యూటేషన్లను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రద్దు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్న సిబ్బందిని ఎందుకు డిప్యూటేషన్ వేశారో పూర్తి స్థాయిలో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. మరి మంత్రి ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌లో విద్యార్థిని ప్రదర్శన


ఎగ్జిబిట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థిని

వెల్దుర్తి(తూప్రాన్‌) : ఇటీవల మెదక్‌ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ ఎగ్జిబిషన్‌లో మాసాయిపేట ఉన్నత పాఠశాలకు చెందిన దుంపల సిరి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం గెలుపొందడంతోపాటు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఇందులో భాగంగానే మహబూబ్‌నగర్‌ జిల్లా జడ్చర్ల ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి ప్రారంభమైన రాష్ట్రస్థాయి సైన్స్‌ ఎగ్జిబిషన్‌లో పాల్గొంది. గైడ్‌ ఉపాధ్యాయుడు ఆంజనేయులు సహకారంతో ఇంటి వద్దనే ఉండి పంటలకు సాగునీరు అందించే 'స్వయం చాలక నీటి పారుదల రోబో' నమూనా ప్రదర్శిస్తోంది. ఈ సందర్భంగా విద్యార్థిని సిరిని హెచ్‌ఎం ధర్మపురి, సైన్స్‌ ఉపాధ్యాయుడు రంగారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

బైండోవర్‌ ఉల్లంఘనలో నిందితుడికి జైలు


జైలుకు తరలిస్తున్న పోలీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): బైండోవర్‌ ఉల్లంఘించినందుకు ఓ వ్యక్తికి జైలు శిక్ష పడింది. ఈ ఘటన అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామ పరిధిలోని దాక్యనాయక్‌ తండాలో చోటుచేసుకుంది. ఎక్సైజ్‌ శాఖ సీఐ పవన్‌ కథనం మేరకు. తండాకు చెందిన మూడావత్‌ కిషన్‌ ఇటీవల గుడుంబా తయారీ, రవాణా చేస్తూ పట్టుబడటంతో తహసీల్దార్‌ ఎదుట సదరు వ్యక్తిని బైండోవర్‌ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే మరోసారి గుడుంబా తయారీ, రవాణా చేస్తూ దొరకడంతో తహసీల్దార్‌ అనంతరెడ్డి ఎదుట హాజరు పర్చినట్లు పేర్కొన్నారు. బైండోవర్‌ నిబంధనలు ఉల్లంఘన కింద కిషన్‌కు జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో జైలు, జరిమానా

పటాన్‌చెరుటౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూ నాయక్‌ కథనం మేరకు.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 17 మందిని పట్టుబడ్డారని, వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా కోర్టు ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.1,500, ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.2వేలు, ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానాతోపాటు అందరికీ రెండు రోజులు జైలు విధించినట్లు పేర్కొన్నారు.

సిద్దిపేటలో తొమ్మిది మంది

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమాన, జైలు శిక్ష విధించింది. సిద్దిపేట ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌కుమార్‌ కథనం మేరకు.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఐదు రోజుల కిందట తమ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించాం. 9 మంది మద్యం తాగి పట్టుబడగా మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరు పర్చాం. విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.19 వేల జరిమానాతోపాటు ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

■ ఇది ప్రభుత్వ కార్యాలయమే..?

- చిందరవందరగా ఫైళ్లు, విద్యుత్‌ సరఫరా వైర్లు
- ర్యాక్‌లు లేవు.. డెస్క్‌లు కరువు
- అధ్వానంగా డీఈఓ కార్యాలయం

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): ఆ కార్యాలయంలోకి అడుగుపెట్టగానే అంత అస్తవ్యస్తంగా కనిపిస్తుంది.. అది జిల్లా కార్యాలయం ఉండే విధంగా ఉండదు.. కిందికి చూడకుండా మాట్లాడుతూ వెళ్తే కింద పడాల్సిందే.. అదే మన జిల్లా విద్యాశాఖ కార్యాలయం. జిల్లాలోని అన్ని పాఠశాలలు, విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు, పరీక్షల నిర్వహణ, తదితరాలను నిర్వహించే జిల్లా విద్యాశాఖ కార్యాలయం అంతా గందరగోళంగా మారింది. అవసరమైన ర్యాక్‌లు, డెస్క్‌లు లేకపోవడం వల్ల ముఖ్యమైన ఫైళ్లు కూడా విచ్చలవిడిగా పడి ఉన్నాయి. ఒకవేళ ముఖ్యమైన ఫైళ్లు మాయమైతే ఎవరు బాధ్యులు అని అక్కడికి వచ్చిన ప్రజలు చర్చించుకుంటున్నారు. అదే విధంగా విద్యుత్‌ వైర్లు, నెట్‌ సరఫరా చేసే వైర్లు సక్రమంగా అమర్చకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది, ప్రజల కాళ్లకు తగిలి కిందపడుతున్నారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో వివిధ పనుల నిమిత్తం అక్కడికి వస్తున్న ప్రజలు, జిల్లా ముఖ్య కార్యాలయమే ఇలా ఉంటే, విద్యార్థులకు చదువు, ఇతర సౌకర్యాలు ఎలా ఉంటాయో అని వాపోతున్నారు.


ప్రమాదకరంగా నెట్‌, విద్యుత్‌ వైర్లు


ఫైళ్లను తెల్లబట్టలో కట్టి పక్కకు పెట్టిన దృశ్యం


ర్యాక్‌లు లేకపోవడంతో ఇష్టారీతిన ఫైళ్లు

మెరుగైన విద్యను అందించాలి

డీఈఓ రాధాకిషన్‌

- కౌడిపల్లిలో బాలికల ఉన్నత, ప్రాథమిక పాఠశాల తనిఖీ

కౌడిపల్లి(నర్సాపూర్‌): విద్యార్థులకు మెరుగైన విద్య, భోజనం అందించాలని డీఈఓ రాధాకిషన్‌ ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు చెబుతున్న డిజిటల్‌ విద్యాబోధనను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంతోపాటు పాఠశాల రికార్డులు, హాజరు తనిఖీ చేశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు. తరగతి గదిలో చదువులో వెనుకబడిన విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి ప్రత్యేక బోధన చేయాలన్నారు. కొత్త మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం నాణ్యతగా వండిపెట్టాలని చెప్పారు. పదవ తరగతికి ప్రత్యేక బోధన జరుగుతుందని వందశాతం ఫలితాలు వచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సాజిద్‌అలీ, ఓం ప్రకాశ్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


డిజిటల్‌ బోధనను పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్‌

మైనర్లకు వాహనాల ఇవ్వొద్దు..

హవేళీఘణాపూర్‌(మెదక్‌) : మైనర్‌ విద్యార్థులకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని డీఈవో రాధాకిషన్‌ అన్నారు. కొంత కాలంగా యువకులు అతివేగంగా వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందుతున్నారని అన్నారు. కూచన్‌పల్లిలో మంగళవారం రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించగా డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ రూల్స్‌ను పాటిస్తూ తప్పకుండా హెల్మెట్‌ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. అనంతరం ఏఎంవీఐలు శ్రీనివాస రావు, శ్రీలేఖలు విద్యార్థులకు వాహనాలు నడిపే సమయంలో పాటించాల్సిన నిబంధనల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

బస్సును బైక్‌తో ఢీకొట్టిన ఇద్దరు


గాయపడ్డ భూషణం

కొల్చారం(నర్సాపూర్‌): టీవీఎస్‌ వాహనం బస్సును ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని మెదక్‌–జోగిపేట ప్రధాన రహదారి రంగంపేట గ్రామం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పైతర గ్రామానికి చెందిన కోరంపల్లి ఆంజనేయులు, కుమ్మరి భూషణం టీవీఎస్‌ బైక్‌పై మెదక్‌ వైపు నుంచి వస్తున్నారు. రంగంపేట గ్రామ శివారులోని వైన్‌ వద్దకు రాగానే ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రన్నింగ్‌ ట్రైన్‌ దిగుతూ వ్యక్తి

చిన్నశంకరంపేట(మెదక్‌): రన్నింగ్‌ ట్రైన్‌ నుంచి దిగుతూ కిందపడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రామాయంపేట మండలం కాట్రియాల్‌ గ్రామానికి చెందిన కృష్ణ బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లాడు. అనంతరం తిరిగి వస్తూ మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో రన్నింగ్‌లో ట్రైన్‌ దిగబోయాడు. దీంతో కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించినట్లు కామారెడ్డి ఎస్‌హెచ్‌ఓ హన్మాగౌడ్‌ తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్లూరు రింగ్‌ రోడ్డుకు ఆనుకొని ఉన్న సర్వీస్‌ రోడ్డుపై సోమవారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అతడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు నగరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి ఒంటిపై ఆరెంజ్‌ కలర్‌ షర్టు, స్వెట్టర్‌ ధరించినట్లు పోలీసులు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డెలివరీ బాయ్‌ మృతి


దుర్గాప్రసాద్‌ (ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌ : రోడ్డు ప్రమాదంలో ఫుడ్‌ డెలివరీ బాయ్‌ మృతి చెందిన ఘటన పటాన్‌ చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విశ్వజన్‌ కథనం మేరకు.. సంగారెడ్డి గణేశ్‌నగర్‌కు చెందిన దుర్గాప్రసాద్‌(21) ఫుడ్‌ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా సోమవారం రాత్రి సంగారెడ్డి నుంచి పటాన్‌ చెరు వైపు స్కూటీపై వస్తున్నాడు. తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి చర్చి సమీపంలోకి రాగానే వెనుక నుంచి టిప్పర్‌ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు కాగా పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించిన కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ..

శివ్వంపేట(నర్సాపూర్‌) : గుర్తు తెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని చండీ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. సుమారు 40 నుంచి 45 ఏళ్ల ఉన్న మహిళ కొద్ది రోజులుగా మతిస్థిమితం సరిగా లేక చండీ గ్రామ శివారులో తిరుగుతోంది. మంగళవారం తెల్లవారు జామున గ్రామ శివారులోని జేఎస్‌ఆర్‌ ఫంక్షన్‌ హాల్‌ ఎదురుగా నర్సాపూర్‌, తూప్రాన్‌ రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పంచాయతీ కార్యదర్శి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి ఒంటిపై నలుపు కలర్‌ లంగా, జాకెట్‌ ధరించి ఉందన్నారు.

భవనంపై నుంచి పడి కూలీ


సోయల్‌ మృతదేహం

రామచంద్రాపురం (పటాన్‌చెరు): నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి కూలీ మృతి చెందిన ఘటన కొల్లూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఉస్మాన్‌ నగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌ రాష్ట్రానికి చెందిన సోయల్‌ మండల్‌ (35) జీవనోపాధి కోసం ఏడాది కిందట తెల్లాపూర్‌కి వలసొచ్చాడు. తెల్లాపూర్‌ పరిధిలోని ఉస్మాన్‌ నగర్‌లో ఓ నిర్మాణంలో కూలీగా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం రెండో అంతస్తులో పనులు చేస్తుండగా కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

నర్సాపూర్‌ రూరల్‌: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నర్సాపూర్‌ ఎస్సై లింగం కథనం మేరకు.. శివ్వంపేట మండలం లింగోజిగూడ తండాకు చెందిన మాలోత్‌ చందర్‌ (27) సోమవారం బైక్‌పై తండా నుంచి నర్సాపూర్‌ వస్తుండగా నారాయణపూర్‌ సమీపంలో కోతులు అడ్డం రావడంతో అదుపుతప్పి కిందపడ్డా డు. తీవ్రగాయాలైన అతడిని స్థానికులు నర్సాపూర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీకి తరలించగా సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ టైర్‌లో చున్నీ చిక్కుకొని మహిళ మృతి

- కుమారుడితో కలిసి కళాశాలలో పేరెంట్స్‌ మీటింగ్‌కు వెళ్తుండగా కిందపడ్డ తల్లి
- అమీన్‌పూర్‌లో మున్సిపాలిటీలో ఘటన

పటాన్‌చెరు టౌన్‌: బైక్‌ టైర్‌లో చిక్కుకొని కిందపడటంతో తీవ్ర గాయాలై మహిళ చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య కథనం మేరకు.. పటాన్‌ చెరు డివిజన్‌ పరిధిలోని జీపీ కాలనీలో నివాసం ఉండే శేషు కుమార్‌, రజిత (38) దంపతుల కుమారుడు నవదీత్‌ దూలపల్లిలోని సెయింట్‌ మార్టిన్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో ఎంసీఏ చదువుతున్నాడు. మంగళవారం కళాశాలలో పేరెంట్స్‌ మీటింగ్‌ ఉండడంతో నవదీత్‌ తల్లిని బైక్‌పై తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో అమీన్‌పూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్‌ కమాన్‌ సమీపంలోకి రాగానే వెనుకాల కూర్చున్న రజిత చున్ని బైక్‌ టైర్‌లో చిక్కుకొని రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం అమీన్‌పూర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతురాలి భర్త శేషు కుమార్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదుపుతప్పి లారీ బోల్తా


బోల్తాపడిన లారీ

చిన్నశంకరంపేట(మెదక్‌): బస్సును తప్పించబోయి లారీ బోల్తా పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి బ్రిడ్జి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్‌ కథనం మేరకు.. మెదక్‌–చేగుంట ప్రధాన రహదారిపై మెదక్‌ వైపు నుంచి కోళ్లఫారమ్‌ దాణా లారీ వేగంగా వస్తుంది. ఇదే సమయంలో వెనుక నుంచి ఆర్టీసీ బస్సు దూసుకొచ్చి లారీని ఓవర్‌ టేక్‌ చేసింది. అనంతరం బస్సు ఒక్కసారిగా స్లో అవడంతో లారీ డ్రైవర్‌ సడన్‌ బ్రేక్‌ వేశాడు. దీంతో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.

ఎస్‌జీఎఫ్‌ సాఫ్ట్‌ బాల్‌ జట్ల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

వెల్దుర్తి(తూప్రాన్‌):మెదక్‌ జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో మాసాయిపేట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఉమ్మడి మెదక్‌ జిల్లా అండర్‌ 14 బాల, బాలికల సాఫ్ట్‌ బాల్‌ జట్ల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఉమ్మడి జిల్లా నుంచి 40 మంది బాలురు, 30 మంది బాలికలు హాజరు కాగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని 16 మంది చొప్పున ఎంపిక చేసినట్లు మెదక్‌ జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ కార్యదర్శి గంగాల రమేశ్‌ తెలిపారు. ఈ జట్లు మెదక్‌ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్‌ గేమ్స్‌ సాఫ్ట్‌ బాల్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.ఎంపికకు మాసాయిపేట మండల విద్యాధికారి లీలావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారన్నారు. ఎంపిక పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్‌ కాంప్లెక్స్‌ హెచ్‌ఎం ధర్మపురి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, స్థానిక ఉన్నత పాఠశాల ఫిజికల్‌ డైరెక్టర్‌ శ్యామ్‌ సుందర్‌ శర్మ, పద్మ, రాజ్‌కుమార్‌, కోచ్‌ రేణుకతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులు


విద్యార్థిని కనకలక్ష్మి

చేర్యాల(సిద్దిపేట): గోహతీలో సరుసాజై స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌లో 10 నుంచి 13 వరకు జరిగే జాతీయ స్థాయి బీచ్‌ హ్యాండ్‌ బాల్‌ పోటీలకు మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన తాటిపాముల కనకలక్ష్మి ఎంపికై నట్లు ఉమ్మడి మెదక్‌ జిల్లా హ్యాండ్‌ బాల్‌ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌గౌడ్‌ తెలిపారు. ఉమ్మడి మెదక్‌ జిల్లా నుంచి కనకలక్ష్మి పాల్గొంటుందని తెలిపారు. ఆయన వెంట హ్యాండ్‌ బాల్‌ కార్యదర్శి మొహమ్మద్‌ రఫత్‌ ఉమర్‌, కోశాధికారి రాజు, ప్రతినిధులు సన్నీ, కుమార్‌, రమేశ్‌ ఉన్నారు.

క్రికెట్‌ పోటీలకు అభినవ్‌..


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌ శ్రీకర్‌

కోహెడ(హుస్నాబాద్‌): మండల కేంద్రానికి చెందిన తలారి అభినవ్‌ చక్రవర్తి క్రికెట్‌ చాంపియన్‌షిప్‌ అండర్‌ 19 బాలుర విభాగంలో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. టీ–10 క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో లక్నో (ఉత్తరప్రదేశ్‌)లో నేటి నుంచి 10 వరకు జరుగనున్న క్రికెట్‌ పోటీల్లో పాల్గొననున్నాడు. అభినవ్‌ ప్రస్తుతం కరీంనగర్‌ జిల్లా తిమ్మాపూర్‌ మండలం అల్గునూర్‌లోని పారామిత వల్డ్‌ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్‌ శ్రీకర్‌, వ్యాయామ ఉపాధ్యాయులు జెట్టి శ్రీనివాస్‌, తోట శ్రీధర్‌, మహ్మద్‌ వహీద్‌ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నలుగురు..


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నర్సాపూర్‌ రూరల్‌: రాష్ట్రస్థాయి ఖో ఖో బాలికల సీనియర్‌ జట్టుకు నర్సాపూర్‌ గురుకుల పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌ మంగళవారం తెలిపారు. 8 నుంచి 11 వరకు వరంగల్‌ జిల్లా గీసుకొండలో జరిగే 57వ రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ కిషోర్‌, పీటీ లింగా గౌడ్‌, ఉపాధ్యాయులు సురేశ్‌, రవి అభినందించారు.

హాకీ పోటీలకు ఆదర్శ కళాశాల విద్యార్థి


అనిల్‌కుమార్‌తో ఉపాధ్యాయులు

దౌల్తాబాద్‌ (దుబ్బాక): స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్‌ 19 రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు దౌల్తాబాద్‌ ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్‌ చదువుతున్న విద్యార్థి కే. అనిల్‌ కుమార్‌ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ దుర్గాప్రసాద్‌ మంగళవారం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు నల్గొండ జిల్లాలో 8 నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని, ఉమ్మడి మెదక్‌ జిల్లా జట్టు తరపున పాల్గొంటాడని తెలియజేశారు.

జాతీయ విద్యా సదస్సుకు మన ఉపాధ్యాయులు


నాగరాజు


తిరుపతి


విద్యార్థులతో సయ్యద్‌ సందాని

చిన్నశంకరంపేట(మెదక్‌)/దుబ్బాక టౌన్‌/సిద్దిపేట అర్బన్‌: న్యూఢిల్లీలో జాతీయస్థాయి సంస్థ సీసీఆర్‌టీ (సెంటర్‌ ఫర్‌ కల్చరల్‌ రిసోర్స్‌ అండ్‌ ట్రైనింగ్‌) ద్వారా అందించే శిక్షణకు మెదక్‌ జిల్లా నార్సింగి మండలం శేరిపల్లి జెడ్పీపాఠశాల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు తాడబోయిన తిరుపతి ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి మొత్తం పది మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణకు ఎంపిక కాగా మెదక్‌ జిల్లా నుంచి తిరుపతి వెళ్లనున్నారు. 8 నుంచి 28 వ తేదీ వరకు ఢిల్లీలో జరుగనున్న జాతీయ విద్యా విధానం 2020పై శిక్షణకు హాజరవుతారని పేర్కొన్నారు. నూతన విద్యా విధానంలో వస్తున్న మార్పులు, పాఠశాలల పని తీరుపై శిక్షణ ఉండనున్నట్లు సూచించారు. తనను ఢిల్లీ స్థాయి శిక్షణకు ఎంపిక చేసిన డీఈఓ రాధాకిషన్‌, ఏఎంఓ సుదర్శనమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే దుబ్బాక మున్సిపల్‌ పరిధిలోని లచ్చపేట మోడల్‌, స్కూల్‌ పొలిటికల్‌ సైన్స్‌ ఉపాధ్యాయుడు రాధారి నాగరాజు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ బుచ్చిబాబు తెలిపారు.

సిద్దిపేట అర్బన్‌ మండలంలోని బక్రిచెప్యాల ఎంపీపీఎస్‌ హెచ్‌ఎం సయ్యద్‌ సందాని కూడా జాతీయ విద్యా సదస్సులో పాల్గొననున్నారు. పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా తమ విద్యా బోధన పద్ధతులను సదస్సుకు ఎంపికైన ఉపాధ్యాయులు ప్రదర్శిస్తారు. సయ్యద్‌ సందాని ఎంపిక కావడంపై డీఈఓతో పాటు తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

పూత దశలో నీటి ఎద్దడి ఉండొద్దు

తెగుళ్లు సోకితే నివారణ చర్యలు చేపట్టాలి

- జిల్లాలో 18,960 ఎకరాల్లో శనగ సాగు
- రైతులకు జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌ సూచనలు, సలహాలు


మునిపల్లి శివారులో సాగు చేసిన శనగ పంట

మునిపల్లి(అందోల్‌): రబీలో శనగ పంటను రైతులు అధికంగా సాగు చేస్తారు. పంట రక్షణకు సకాలంలో చర్యలు చేపట్టకపోతే శనగ పచ్చ పురుగులు, వేరు ఎండు తెగులు పంటను సోకుతాయి. దీని వల్ల దిగుబడులు తగ్గిపోతాయి. అయితే ఈ సమయంలో శనగలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను గ్రామాల్లో మండల వ్యవసాయాధికారులు వివరిస్తారని జిల్లా వ్యవసాయధికారి శివప్రసాద్‌ చెబుతున్నారు.

జిల్లాలో మొత్తం భూమి 3 లక్షల 12 వేల హెక్టార్లు ఉండగా దీనిలో 2 లక్షల 24 వేల హెక్టార్లపై చిలుకు భూమి సాగులో ఉంది. అంతే కాకుండా వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లాలో శనగ పంట సుమారు 18,960 ఎకరాలు సాగవుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ఎండుతెగులు

నేలలో ఉన్న ఈ శిలీంధ్రం అన్ని దశల్లో ఆశించి నష్టం కలిగిస్తుంది. ముఖ్యంగా కాయ దశలో ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రాములు కాఫర్‌ ఆక్సీక్లోరైడ్‌, లేదా ప్రోకొనాజోల్‌ 2.5 మి. లీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

శనగ పచ్చ పురుగు

ఇవి మొక్కల లేత భాగాన్ని తినడంతో ఎదుగుదల ఆగిపోతుంది. నివారణకు లీటరు నీటికి క్లోరిఫైరిఫాస్‌ 2 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేయాలి. పంట పూత దశలో నీటి ఎద్దడికి గురి కాకుండా చూడాలి. కలుపును సకాలంలో నివారించడం వల్ల మంచి దిగుబడులు సాధించవచ్చు.

అవగాహన కల్పిస్తున్నాం



పంటలో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సస్యరక్షణలో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదిస్తే రైతుల పొలం వద్దకు వచ్చి పంటలను పరిశీలించి పలు సూచనలు చేస్తారు.

– శివప్రసాద్‌, జిల్లా వ్యవసాయాధికారి